ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 22 జూన్ 2024



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

-వార్త 5వ పేజీలో..



యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, తదితరులు



ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

అసెంబ్లీలో శుక్రవారం శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వంగలపూడి అనిత (పాయకరావుపేట), చింతకాయల అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం), బండారు సత్యనారాయణమూర్తి (మాడుగుల), కొణతాల రామకృష్ణ (అనకాపల్లి), కేఎస్ఎన్ఎస్ రాజు (చోడవరం), సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి), పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి)

అనకాపల్లిలోనూ అదే వరస!

వైసీపీ దందా

జీవీఎంసీ అనుమతులు లేకుండానే పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మాణం

- హైవే సమీపంలో 1.75 ఎకరాలు 33 ఏళ్లు లీజుకు...
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి...
- ఏడాదికి ఎకరానికి కేవలం రూ.1000 చెల్లించేలా ఉత్తర్వులు
- స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేసినా పట్టించుకోని వైనం
- హైకోర్టును ఆశ్రయించిన కొత్తూరు నర్సింగరావుపేట గ్రామస్థులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ సాగించిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. విశాఖపట్నంలో మాదిరిగానే అనకాపల్లిలోనూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకుని పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ నిర్మించారు. జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవ్ కాకుండానే కేవలం దరఖాస్తు చేసి భవన నిర్మాణ పనులు చకచకా కానిచ్చేశారు.

అనకాపల్లి మండలం రాజుపాలెం రెవెన్యూ కొత్తూరు నర్సింగరావుపేట గ్రామ పరిధిలోని సర్వే నంబరు 75/1లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ స్థలం జిల్లా పార్టీ కార్యాలయానికి కేటాయించేలా వైసీపీ నాయకులు 2022లో పావులు కదిపారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రెవెన్యూ అధికారులు 75/1లోని ఒక ఎకరా 75 సెంట్ల స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి మరీ పార్టీ కార్యాలయానికి కేటాయించేశారు. జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతంలో ఎకరా రూ.8 కోట్లు నుంచి రూ.10 కోట్లు వరకూ పలుకుతోంది. కానీ వైసీపీ పెద్దలు ఏడాదికి కేవలం ఎకరాకు రూ.వెయ్యి చొప్పున చెల్లించేలా 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. అంటే ఏడాదికి కేవలం రూ.1,750 మాత్రమే ప్రభుత్వానికి చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి 340 జీవో ప్రకారం రాజకీయ పార్టీలు, సంస్థలకు స్థలాలు కేటాయించాల్సి వస్తే..ప్రజాధనంతో అభివృద్ధి చేయని ప్రభుత్వ, బంజరు భూములను మాత్రమే ఇవ్వాలి. కానీ వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిబంధనలు పక్కనపెట్టి సర్వే నంబరు 75/1లో వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన ఎకరా 75 సెంట్ల స్థలాన్ని 2022 డిసెంబరు 20న జీఓ నంబరు 759 ఆధారంగా కేటాయించుకున్నారు.



అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటలో వైసీపీ కార్యాలయం కోసం జీవీఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన ప్యాలెస్

జీవీఎంసీ ప్లాన్ అప్రూవ్ కాకుండానే..

నాటి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పేరుతో జీవీఎంసీ ప్లానింగ్ విభాగానికి భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కానీ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫీజులేవీ చెల్లించకపోవడంతో ఇంతవరకూ అధికారికంగా ప్లాన్ అప్రూవ్ కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చిన లీజు భూమిలో నిర్మాణ పనులు చేపట్టాల్సి వస్తే గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, పచ్చదనం పెంపు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీలు కింద రూ.1.54 లక్షలు అంతా కలిపి రూ.17 లక్షల వరకూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆన్‌లైన్‌లో చెల్లించాలి. మొత్తం ఫీజు చెల్లించిన తరువాతే బిల్డింగ్ ప్లాన్ అధికారి క్షేత్ర పర్యటన చేసి, ప్లాన్ అప్రూవ్ చేస్తారు. కానీ వైసీపీ నాయకులు కేవలం ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకొని పనులు మొదలెట్టేశారు. వైసీపీ కార్యాలయ భవనానికి స్థలాన్ని కేటాయించవద్దంటూ స్థానికులు కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణం దాదాపు పూర్తిచేసేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడికి చెందిన రాంకీ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ భవన నిర్మాణం చేపట్టింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన వైసీపీ కార్యాలయ పనులు నిలిపేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా అని జీవీఎంసీ ఏసీపీ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. గత ఏడాది ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌లో గుక్కెడు నీరూ కరువే!

పనిచేయని తాగునీటి కేంద్రాలు మరమ్మతుకు గురైనా పట్టించుకోని అధికారులు

- వార్డుల్లోనూ అదే పరిస్థితి
- స్వయంగా నాటి మంత్రి గుర్తించి సూపరింటెండెంట్ దృష్టికి వెళ్లినా ఫలితం శూన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్‌లో రోగులు, వారికి సాయంగా వచ్చేవారు తాగడానికి గుక్కెడు నీరు కూడా దొరకడం లేదు. ఇక బాత్‌రూమ్‌లకు నీటి సరఫరా గురించి చెప్పనక్కర్లేదు. అధికారులు నాలుగు భవనాలు కట్టేసి, రంగులేసేసి అంతా బాగుందనుకుంటున్నారు. అసలు రోగులకు ప్రాథమిక అవసరాలైన నీరు, ఆహారం గురించి పట్టించుకోవడం లేదు.



కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కొళాయిల నుంచి తాగు నీరు రాని దృశ్యం

పనిచేయని ఆర్‌ఓ తాగునీటి కేంద్రాలు

కేజీహెచ్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు తాగునీరు అందించేందుకు పలువురు దాతలు ఎక్కడికక్కడ ఆర్‌ఓ నీటి కేంద్రాలు ఏర్పాటుచేశారు. గైనకాలజీ, పీడియాట్రిక్, రాజేంద్రనగర్, కార్డియాలజీ ఎదురుగా, అవుట్ పేషెంట్ విభాగం వద్ద ఇవి ఉన్నాయి. వీటిలో ఒక్కటి కూడా పనిచేయడం లేదు. ఎంతో వ్యయంతో ఏర్పాటుచేసిన కేంద్రాలు పాడైపోతే చూస్తున్నారు తప్పితే వాటికి మరమ్మతులు చేయించడం లేదు.

వార్డుల్లో పనిచేయని యంత్రాలు

బయట కాకుండా ఏ వార్డుకు ఆ వార్డులో ప్యూరిఫైర్ వాటర్ కోసం ప్రత్యేక యంత్రాలు రెండున్నరేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. వాటిని పెట్టిన మూడు నెలలకే నాటి ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని కేజీహెచ్ తనిఖీకి వెళ్లారు. రాజేంద్రప్రసాద్ వార్డులో వాటర్ ప్యూరిఫైర్ పనిచేయడం లేదని గుర్తించి, నాటి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లారు. చాలా వార్డులో ఇవి కూడా పనిచేయడం లేదు. ఫిల్టర్లు మార్చే దిక్కు లేక మూలకు చేరుతున్నాయి.

కరివేపాకు కూడా కనిపించని కిచిడీ!

రోగులకు జావ వంటి ఉప్మా పెడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' రెండు రోజుల క్రితం కథనం ప్రచురించగా అధికారులు అప్రమత్తమయ్యారు. డైట్ కాంట్రాక్టర్‌ను మందలించారు. దాంతో శుక్రవారం నుంచి ఉప్మా ఆపేశారు. ఆ స్థానంలో కిచిడీ పేరుతో కలర్ రైస్ అందిస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు కలిపి వండితే దానిని 'కిచిడీ' అంటారు. కానీ రోగులకు పంపిణీ చేసిన కిచిడీలో కనీసం కరివేపాకు గానీ, పచ్చిమిరప కాయ ముక్క గానీ లేవు. కారం, పసుపు, ఉప్పు కలిపిన అన్నం వండి పెడుతున్నారు.

ఇడ్లీ యంత్రం కొనుగోలుకు కొటేషన్

గతంలో ఇడ్లీ తయారీకి యంత్రం ఉండేది. అది పాడైపోయి ఏడాది దాటింది. ఆరు నెలల క్రితం కొత్తది కొనుగోలు చేయడానికి ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ అధ్యక్షులైన కలెక్టర్ అనుమతి ఇచ్చారు. టెండర్లు ... మిగతా 6వ పేజీలో

రాంబిల్లి ఎన్‌ఏఓబీలో ప్రమాదం

యువకుడి మృతి

ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని తీసుకు వస్తుండగా హరిపాలెంలో అడ్డుకున్న పోలీసులు

- మృతుడి బంధువులు, స్నేహితులు ఆందోళన
- అంగీకరించని పోలీసులు
- హరిపాలెం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



హరిపాలెంలో వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

అచ్యుతాపురం, జూన్ 21:

రాంబిల్లి మండలం ఎన్‌ఏఓబీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. వైద్య పరీక్షలు నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లి మృతదేహాన్ని తిరిగి తీసుకువస్తున్న వాహనాన్ని పోలీసులు మండలంలోని హరిపాలెం వద్ద అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా హరిపాలెంలో శుక్రవారం రాత్రి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వివరాల్లోకి వెళ్తే..



కొయిలాడ మారుతి (ఫైల్ ఫొటో)

మునగపాక మండలం పాటిపల్లికి చెందిన కొయిలాడ మారుతి (22) రాంబిల్లి మండలం ఎన్‌ఏఓబీలో ఒక విభాగంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకొని తన వాహనంపై స్వగ్రామం వస్తుండగా ఎదురుగా వస్తున్న భారీ లారీ ఢీకొని మారుతి అక్కడికక్కడే చనిపోయినట్టు తెలిసింది. అయినా మారుతిని అనకాపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యాధికారులు మృతి చెందినట్టు ... మిగతా 6వ పేజీలో

శిథిలావస్థలో గోకివాడ ఆనకట్ట

కనీస మరమ్మతులకు నోచుకోని వైనం

- అన్నదాతలకు సాగు నీటి కష్టాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కూటమి ప్రభుత్వంపై రైతన్నల ఆశలు

రాంబిల్లి, జూన్ 21:

మండలంలోని మేజర్ శారదా నదిపై నిర్మించిన గోకివాడ ఆనకట్ట శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో ఆయకట్టు రైతాంగం సాగునీటి కష్టాలు పడుతోంది. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఆనకట్ట కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.



శిథిలమైన గోకివాడ ఆనకట్ట



దెబ్బతిన్న రాతిపేర్పు..

మేజర్ శారదా నదిపై బ్రిటిష్ వారి హయాంలో గోకివాడ వద్ద నిర్మించిన ఆనకట్ట ఆధునికీకరణ కలగా మారింది. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో రాంబిల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లోని పది వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోతోంది. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. వరుసగా నాలుగేళ్ల భారీ వర్షాలు కురవడంతో మేజర్ శారదా నదిలో నీటి ప్రవాహం పెరిగి ఈ ఆనకట్ట దెబ్బతింది. ఆనకట్ట తలుపులు సక్రమంగా పనిచేయడం లేదు. ఆనకట్ట వెప్రాన్, దిగువభాగంలోని ప్లాట్‌ఫామ్ రాతి పేర్పు పూర్తిగా దెబ్బతింది. 2011 నవంబరు 2న ఎలమంచిలిలో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి రూ.6 కోట్లతో ఆనకట్టను ఆధునీకరిస్తామని ప్రకటించారు కానీ నీటి మూటగానే మిగిలింది. 2017లో ఈ ఆనకట్ట అభివృద్ధికి రూ.77లక్షలు మంజూరైన పనులు చేపట్టలేదు. మళ్లీ 2019లో రూ.5 కోట్లతో ఆనకట్ట పూర్తిస్థాయి మరమ్మతులకు ప్రతిపాదనలు వైసీపీ ప్రభుత్వానికి పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆనకట్ట మరమ్మతుకు రూ.2 కోట్లతో మరోసారి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని అధికారులు ప్రకటించినా నేటికీ నిధులు మంజూరు కాలేదని రైతులు తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు అయిన పంచకర్ల రమేశ్‌బాబు, యూవీ రమణమూర్తిరాజు గోకివాడ ఆనకట్టను ఆధునికీకరణ చేయిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు కార్యరూపం దాల్చలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని వారు మండిపడుతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హయాంలోనైనా గోకివాడ ఆనకట్టకు మోక్షం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఈ ఆనకట్టపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మూడు మండలాల రైతులు కోరుతున్నారు.



వంతెన కింద కుంగిన దృశ్యం

కుంగిన రామచంద్రపురం వంతెన

అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నానికి నిలిచిన పెద్ద వాహనాల రాకపోకలు

- విద్యార్థులు, ప్రయాణికుల ఇక్కట్లు
- త్వరలో డైవర్షన్ రోడ్డు నిర్మిస్తామంటున్న అధికారులు

కోటవురట్ల, జూన్ 21:

బ్రిటీష్ పాలకులు రామచంద్రపురం జంక్షన్ వద్ద నిర్మించిన వంతెన ఒక వైపునకు కుంగిపోయింది. దీంతో మూడు రోజుల నుంచి ఆర్అండ్‌బీ అధికారులు వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

మండలంలోని రామచంద్రపురం జంక్షన్ వద్ద సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన వంతెనకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఎప్పుడు కూలిపోతుందోనని వాహన చోదకులు భయంతోనే రాకపోకలు సాగిస్తూ వచ్చారు. భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా ఎవరు పట్టించుకోకుండా యథావిధిగా వాహనాలు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో భారీ బరువుతో టిప్పర్ లారీ వెళ్లడంతో ఒకసారిగా వంతెన ఒకవైపు కుంగిపోయి, శ్లాబ్ బీటలు వేసింది. పిలర్ బీటలు వేయడంతోపాటు శ్లాబ్ కింద వేసిన ఇనుప కమ్మీలు ... మిగతా 6వ పేజీలో



రామచంద్రపురం వంతెనపై రెండు వైపుల భారీ వాహనాలు రాకుండా గోడలు నిర్మించిన అధికారులు

క్రైం... crime news

శారదా నదిలో పడి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, జూన్ 21: ఇక్కడి శారదా నదిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. శ్రీరామనగర్ కాలనీకి చెందిన మారేడుపూడి రాము (33) ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి బహిర్భూమికని సమీపంలోని శారదా నదికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం నది ప్రాంతంలో వెతకగా చెప్పులు, చొక్కా కనిపించాయి. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. చివరకు సాయంత్రం ఐదు గంటల సమయంలో రైల్వే ట్రాక్ కింద నదిలో మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ వివరించారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మద్యం మత్తులో ఒడిశా వాసి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

పరవాడ, జూన్ 21: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఒడిశా రాష్ట్రానికి చెందిన బి.చంద్రశేఖర్ (43) తన తల్లి, బావ విజయ్‌కుమార్‌తో కలిసి గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉండేవాడు. ఇతనికి వివాహం కాలేదు. మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటుండగా, ఈ నెల 17న చంద్రశేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదే రోజు రాత్రి పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే, శుక్రవారం ఉదయం పదకొండు గంటల సమయంలో జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి అనుకుని ఉన్న ఏపీ టిడ్కో గృహ సముదాయాల సమీప తుప్పల్లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతుడు చంద్రశేఖర్‌గా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. మద్యం మత్తులో మృతిచెంది ఉంటాడని అతని బావ విజయ్‌కుమార్ చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మరొకరు..

అచ్యుతాపురం, జూన్ 21 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు సీఐ బుచ్చిరాజు శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలివి. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జారం గ్రామానికి చెందిన బొప్పే పార్వతీశ్వర్ (40) ఇక్కడి కర్మాగారంలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి అచ్యుతాపురం పూడిమడక రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈనెల 19 రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో పూడిమడక రోడ్డులో గల తన నివాసానికి నడిచి వస్తుండగా, సబ్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన అతనిని వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందినట్టు సీఐ తెలిపారు. మృతుని తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తల్లీకూతురు అదృశ్యం

కృష్ణాదేవిపేట, జూన్ 21: గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన తల్లీకూతురు అదృశ్యమైనట్లు భర్త ఫిర్యాదు చేసినట్లు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. వివరాలిలావున్నాయి. లింగంపేట గ్రామానికి చెందిన సందిపర్తి శ్రీను భార్య సందిపర్తి వెంకటలక్ష్మి (26), కుమార్తె శశిరత్నం(8) గురువారం ఉదయం బయటకు వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. తిరిగి రాత్రి అవుతున్నా ఇంటి రాకపోవడంతో బంధువులు ఇళ్లకి వెళ్ళి వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శ్రీను శుక్రవారం కృష్ణాదేవిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కృష్ణాదేవిపేట ఫోన్ : 94409 04240 నంబర్‌కు తెలపాలని ఎస్‌ఐ ఉపేంద్ర కోరారు.

మూడు తులాల బంగారు ఆభరణాల చోరీ

కోటవురట్ల, జూన్ 21: మండలంలోని కొడవటిపూడిలో ఓ ఇంట్లో మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ గుడాల విజయకుమార్ తెలిపిన వివరాలివి. కొడవటిపూడిలో బాలేపల్లి రమణ నివాసం ఉంటున్నాడు. ఇతని భార్య పాయకరావుపేట సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమెతో పాటు పిల్లలు కూడా అక్కడే చదువుకుంటున్నారు. ఈనెల 15వ తేదీ శనివారం ఇంటికి తాళాలు వేసి, వారిని చూసేందుకు రమణ వెళ్లాడు. శుక్రవారం రమణ సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా, ఇంటి తలుపు తీసి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే సోదరుడు రమణకు సమాచారం అందించాడు. అతడు వచ్చి బీరువాలో ఉంచిన మూడు తులాల ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

గంజాయితో ముగ్గురి అరెస్టు

కొయ్యూరు, జూన్ 21: చీడిపాలెం కూడలి వద్ద 15 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. గూడెంకొత్తవీధి మండల ధారకొండకు చెందిన కిల్లో సూరిబాబు, కిల్లో సంహాచలం, తమిళనాడు మధురైకు చెందిన ధర్మారమణీలను అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు.

కోడికత్తి కేసు విచారణ జూలై 4కి వాయిదా

జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందేనన్న న్యాయవాది సలీం


మాట్లాడుతున్న విదసం నేత వెంకటరావు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసు విచారణ జూలై నాలుగో తేదీకి వాయిదా పడింది. ఐదున్నర సంవత్సరాల క్రితం జె.శ్రీనివాసరావు కోడికత్తితో జగన్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ శుక్రవారం విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టులో జరిగింది. నిందితుడు శ్రీనివాసరావు కోర్టుకు హాజరుకాగా, బాధితుడు, ప్రధాన సాక్షి అయిన జగన్ రాకపోవడంతో కేసును వాయిదా వేశారు. దీనిపై న్యాయవాది సలీం మాట్లాడుతూ, ఇన్నాళ్లు ముఖ్యమంత్రిని అంటూ విచారణకు హాజరు కాలేదని, ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యే కాబట్టి తప్పించుకోలేరన్నారు. కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సిందేనన్నారు. విదసం నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ, పోలీసులు ఈ కేసులో పక్షపాత ధోరణి విడనాడాలన్నారు. ఈ ఘటనకు సంబంధించి రెండో కేసు నమోదైందని, అందులో నిందితులైన వైసీపీ నాయకులు కేకే రాజు, ఆదీప్‌రాజ్ తదితరులను కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కోడికత్తితో దాడికి సంబంధించి శ్రీనివాస్‌పై 648 నంబరుతో కేసు నమోదైందని, ఈ ఘటన తరువాత వైసీపీ నాయకులు జగన్‌పై దాడిని నిరసిస్తూ హైవేలో వాహనాలను అడ్డగించారని, భారత క్రికెట్ ఆటగాళ్ల బస్సుపై, పోలీసుల వాహనాలపై రాళ్లు వేసి అద్దాలు పగలగొట్టారని, దానిపై 649 నంబరుతో కేసు నమోదైందని, దానిని పోలీసులు ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. వారికి ఓ నిబంధన, తమకు ఒక నిబంధనా? అంటూ నిలదీశారు. ఈ కేసులో అవసరమైతే పోలీసులు రివ్యూ పిటిషన్ వేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిందితుడు శ్రీనివాస్ సోదరుడు సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

సరుగుడు సాగు.. బాగుబాగు



సరుగుడు తోట

- ఐదేళ్లలో ఎకరాకు రూ.5 లక్షల ఆదాయం
- వరి, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు
- మండలంలో 9 వేల విస్తీర్ణంలో పెంపకం

బుచ్చెయ్యపేట, జూన్ 21: తక్కువ పెట్టుబడి.. ప్రతికూల పరిస్థితులతో సంబంధం లేకుండా పంట చేతికొచ్చే పరిస్థితులు ఉండటంతో రైతులు అధికంగా సరుగుడు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఆరుగాలం పండించినా ఆహార పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్న ఆవేదనతో రైతులు పుష్కలంగా సాగునీరు ఉన్న ప్రాంతాల్లోనూ సరుగుడు తోటలను పెంచడం ప్రారంభించారు. ఒకసారి నాటితే ఐదు సంవత్సరాలకు చేతికి అందే సరుగుడు కలప రైతుకు ఆర్థికంగా చేయూతనిస్తుంది. ప్రస్తుతం క్లోన్ మొక్కలు అందుబాటులోకి వచ్చాయి. ఎకరాకు 70 నుంచి 100 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది. ఎకరాకు సరాసరి సుమారు రూ.5 లక్షలు పైబడి పంట ఆదాయం రావడంతో రైతులకు కాస్త గిట్టుబాటు అవుతోంది.

ఒకప్పుడు ఎకరాకు రూ.2 లక్షలు పైబడి ఆదాయం రావడం కష్టంగా ఉండేది. అలాంటిది ఐదేళ్ల వయస్సు గల సరుగుడుకి సంవత్సరానికి ఎకరానికి రూ.లక్షకు పైగా మొత్తం ఐదేళ్లకి ఐదు లక్షల రూపాయలకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులందరూ సరుగుడు సాగు వైపు మొగ్గ చూపుతున్నారు.

9 వేల విస్తీర్ణంలో సరుగుడు సాగు


బంగారుమెట్టలో సరుగుడు నరుకుతున్న రైతులు.

మండలంలో కనిష్ట స్థాయిలో ఉండే సరుగుడు సాగు విస్తీర్ణం, నేడు చెరకు, వరి సాగు విస్తీర్ణాన్ని అధిగమించింది. ప్రస్తుతం 9 వేల ఎకరాలకు పైబడి విస్తీర్ణానికి ఎగబాకి అధిక సాగు విస్తీర్ణంలో మొదటి స్థానంలో నిలిచింది. ఒకప్పుడు వర్షాధారంగా, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరుగుడు సాగు, నేడు నీటి వనరులు కలిగిన పల్లపు భూముల్లో సైతం సరుగులు సాగు అవుతోంది. దీనికి కారణం గత కాలంగా సరుగుడు ధరలు గణనీయంగా పెరుగుతూ గరిష్ట స్థాయి చేరుకోవడమే. ఒకప్పుడు చెరకు సాగు ఆసక్తి చూపడంతో ప్రధాన పంటగా ఎదిగిన చెరకు సాగు నేడు కనిష్ట స్థాయికి పడిపోయింది. గణనీయంగా పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా చెరకు ధరలు పెరగకపోవడం, సరఫరా చేసిన చెరకు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లింపులను నెలల కాలం చేయకపోవడంతో మండలంలో చెరకుకు ప్రత్యామ్నాయంగా రైతుల సరుగుడు సాగును ఎంచుకున్నారు. అలాగే వరి సాగు గిట్టుబాటు కాకపోతుండడం కూడా ఒక కారణం.

ధర పెరగడమే కారణం..

ప్రస్తుతం మార్కెట్లో సరుగుడు ధరలు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో ఈ సాగుపై రైతులు మక్కువ పెంచుకుంటున్నారు. మార్కెట్లో ఆరు నెలల క్రితం వరకు టన్ను బాదు రకం రూ. 4,800లు, ముక్క రకం రూ. 2,850లు ఉండగా, గత రెండు మూడు నెలలుగా సరుగుడు ధర క్రమేపీ పెరగడంతో నేడు టన్ను బాదు రకం రూ.7 నుంచి 8 వేలు, ముక్క రకం రూ.6,100 లు పలుకుతోంది. దీంతో మెట్టు, పల్లం తేడా లేకుండా నీటి వనరులు కలిగి వాణిజ్య పంట సాగు చేసే రైతులు కూడా సరుగుడు సాగు చేపట్టారు. వడ్డాది, లోపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం, ఎల్‌బీపీ అగ్రహారం, పొట్టి దొరపాలెం, కొండెంపూడి, గంటికొర్లాం, కోమళ్లపూడి, కొండెంపూడి, కేపీ అగ్రహారం, కొండపాలెం, బుచ్చెయ్యపేట, కందిపూడి, దిబ్బిడి, పొలేపల్లి, రాజాం, నీలకంఠాపురం, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, మల్లాం, తైపురం, చిట్టియ్యపాలెం, పెదమదీన, గున్నెంపూడి, కరక, తురకలపూడి, చిట్టియ్యపాలెం, పెదపూడి, పీపీ అగ్రహారం తదితర గ్రామాల్లో సరుగుడు సాగునే చేపట్టారు. వరి, చెరకుతో పాటు ఉద్యాన పంటల స్థానంలో రైతులు సరుగుడు సాగు చేపట్టారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు చేసిన ప్లైవుడ్ తయారీ కర్మాగారానికి రోజుకు వెయ్యి టన్నుల వరకు సురుగుడు, సుబాబుల్ అవసరం కావడంతో మార్కెట్లో ఈ తోటలకు గిరాకీ ఏర్పడింది. దీంతో వీటి ధరలకు ఢోకా ఉండదన్న ధీమాతో రైతులు ఉన్నారు.

అల్లూరి స్మారక పార్కులో కళామందిరం

- మన్యం వీరుడికి చరిత్రను చాటి చెప్పే 30 చిత్రపటాలు ఏర్పాటు
- వచ్చే నెల 4న ఆవిష్కరణ
- జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రరావు


పుస్తకాలను అందిస్తున్న పడాల వీరభద్రరావు

కృష్ణాదేవిపేట, జూన్ 21: వచ్చే నెల 4న స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని కృష్ణాదేవిపేటలోని పార్కు ఆడిటోరియంలో అల్లూరి చరిత్రకు సంబంధించి 30 భారీ చిత్రపటాలతో కళామందిరం ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి, గంటందొర సమాధుల వద్ద ఆయన నివాళులు అర్పించారు. అనంతరం పార్కులోని ఆడిటోరియంలో అల్లూరి చిత్రపటాలు ఏర్పాటు కోసం రాజమండ్రి మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవిప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. కొలతలు వేసి పనులు ప్రారంభించారు.


అల్లూరి చరిత్ర చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన 2/3 అడుగుల సైజు 30 చిత్రాలను తమ సంఘం పార్కులోని ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా అల్లూరి చిత్ర కళామందిరం ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అల్లూరిపార్కు అభివృద్ధికి రూ.కోటి 16 లక్షలు నిధులు ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రూ.30 లక్షలు కేటాయించటం శుభపరిణామం అన్నారు. మాదేటి రవిప్రకాష్ మాట్లాడుతూ అల్లూరి చరిత్రకు సంబంధించిన చిత్రపటాలను ఢిల్లీ, హైదరాబాద్, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు తిలకించి అభినందించారన్నారు. అనంతరం స్థానిక అల్లూరి మైత్రి గ్రంథాలయానికి ప్రముఖ రచయితలు రాసిన విలువైన 20 పుస్తకాలను వీరభద్రరావు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాలరాజు, సభ్యులు భాస్కరమణి, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23న తీరప్రాంత నియంత్రణ జోన్ ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ


నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూన్ 21: తీర ప్రాంత నియంత్రణ-2019 ముసాయిదా నోటిఫికేషన్‌పై జూలై 23న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. శుక్రవారం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ముసాయిదా నోటిఫికేషన్ పత్రాలను నోటీస్ బోర్డులో పదర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తీర ప్రాంతంలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పరవాడ మండల ప్రజలు, మత్స్య కారులు ప్రజాభిప్రాయ సేకరణకు హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చన్నారు. తీరప్రాంతాలలోని మత్స్యకార సంఘాలు, ఇతర వార్గాల జీవనోపాధి భద్రతతో పాటు తీర ప్రాంతాలు, సముద్ర ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ సూత్రాలు ఆధారంగా స్థిర మైన అభివృద్ధిని ప్రోత్సహించడం నోటిఫికేషన్ ప్రధాన లక్ష్యమని ఆర్డీవో పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ సెల్‌కు 15 వినతులు


ఎస్పీకి సమస్యను వివరిస్తున్న ఉద్యోగి

అనకాపల్లి రూరల్, జూన్ 21: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదిహేను మంది పోలీస్ సిబ్బంది వినతులు సమర్పించేందుకు రాగా, అందరితో ఎస్పీ కేవీ మురళీకృష్ణ స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనారోగ్యం, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను పలువురు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్ల ఎంపిక రేపు

అచ్యుతాపురం, జూన్ 21: జిల్లాస్థాయి జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ జట్ల ఎంపిక ఈ నెల 23న అచ్యుతాపురం మండలంలో జరగనుందని సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్. దేముడు తెలిపారు. ఇక్కడి పూడి ఆర్.ఆర్.కాలనీలో గల స్విమ్మింగ్ ఫూల్‌లో ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ై పోటీల్లో ప్రతిభ చూపినవారు జిల్లా జట్టుకు ఎంపిక కానున్నారన్నారు. వీరు జూలై 13, 14 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 95736 90954 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

'నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయండి'

అనకాపల్లి టౌన్, జూన్ 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులకు నియామకమైనవారు ఆయా పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నామినేటెడ్ పదవులు పొందినవారు ప్రస్తుతం ఆ ప్రభుత్వం మారిపోయినందున తమ పదవులను వదులుకోవడం నైతిక బాధ్యతగా పేర్కొన్నారు.

జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటుకు కృషి

- ఏపీ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.కృష్ణ మోహన్


కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం, జూన్ 21: జిల్లా అదనపు న్యాయస్థానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఏపీ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.కృష్ణ మోహన్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా శుక్రవారం నర్సీపట్నం వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ జిల్లా అదనపు న్యాయస్థానం, కోర్టు సముదాయంలో వసతులు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రావాడ సత్యనారాయణ, లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరి నరసింహం, నాగేశ్వరరావు, మెట్టా ప్రభాకర్, కామిరెడ్డి సత్యనారాయణ, చింతల ప్రకాశ్, అనిమిరెడ్డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


అనకాపల్లిలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 21: ప్రతిరోజూ యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గవరపాలెం టీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో శుక్రవారం ఆయుష్ విభాగం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకలను ఎస్పీ మురళీకృష్ణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా విశిష్టతను, ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ యోగా వల్ల ఎన్నో మంచి ఫలితాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, ఆయుష్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో యోగాడేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగా డే ఇంగ్లీషు అక్షరాల్లో కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 10 అడుగుల కొండచిలువ హతం


హతమార్చిన కొండచిలువ

రోలుగుంట, జూన్ 21: మండలంలోని కొవ్వూరులో 10 అడుగుల కొండచిలువను శుక్రవారం గ్రామస్థులు హతమార్చారు. ఈ గ్రామానికి చెందిన యర్రంశెట్టి నత్తిబాబు ఇంటి సమీపంలోని తుప్పల్లో 10 అడుగుల కొండచిలువ కోడిని మింగుతూ కనిపించింది. దీంతో భయపడిన నత్తిబాబు స్థానికుల సహాయంతో కొండచిలువను కర్రలతో కొట్టి హతమార్చారు. ఇంతకు ముందెన్నడూ గ్రామంలోకి ఇలాంటి కొండచిలువ రాలేదని స్థానికులు తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ


ఆది దంపతుల ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 21: స్థానిక గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి వేదమంత్రాల నడుమ పెంటకోట బాలకృష్ణ శకుంతల, సంతోష్ రామలక్ష్మి దంపతులు ఊంజలసేవను జరిపారు. గౌరీ గీతా మహిళా మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృతవర్షిణి సభ్యులు చక్కని గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'సుందరపు' రాక రేపు

- భారీగా స్వాగతం పలికేందుకు కూటమి శ్రేణులు ఏర్పాట్లు


ఎలమంచిలి జనసేన కార్యాలయంలో సమావేశమైన కూటమి నేతలు

ఎలమంచిలి/రాంబిల్లి, జూన్ 21 : ఎమ్మెల్యేగా గెలుపొంది, ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గానికి విచ్చేస్తున్న సుందరపు విజయకుమార్‌కు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలి రావాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎలమంచిలిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 23వ తేదీ ఆదివారం ఎమ్మెల్యే సుందరపుతో పాటు ఎంపీ సీఎం రమేష్, ప్రముఖులు కలిసి ముందుగా ఏటికొప్పాక గ్రామ దేవత బండిమాంబ అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. అనంతరం పులపర్తి జంక్షన్ చేరుకుని జాతీయ రహదారి మీదుగా ఎలమంచిలి చేరుకుని రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా సైతారుపేట రోడ్డు జంక్షన్ నుంచి బైక్ ర్యాలీగా అచ్యుతాపురం జంక్షన్‌కు చేరుకుంటారన్నారు. అనంతరం అక్కడ జరిగే భారీ బహిరంగ సభలో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో కూటమి నేతలు అన్నం బాబ్జీ, లాలం సోమునాయుడు, రమేష్, ఆదిమూర్తి, గుర్రాల శేఖర్, ఇత్తంశెట్టి నాయుడు, నక్కా వెంకటరామన్, సుంకర బుల్లిబాబు, కొటారు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలంలోని హరిపురం జనసేన కార్యాలయంలో కూటమి నేతలు బైలపూడి రామదాసు, రాజాన రమేష్‌కుమార్, ధూళి రంగనాయకులు, వి.దినేబాబు, పప్పల సూకన్నదొర తదితరులు శుక్రవారం రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయకుమార్, ఎంపీ సీఎం రమేష్‌కు ఘన స్వాగతం పలికేందుకు అంతా తరలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జనవరెడ్డి నర్సింగరావు, డీఎస్ఎన్ రాజు, ధర్మిరెడ్డి నాయుడు, కొటాపు పడ్డికాసులు, లాలం తాతబాబు, కిల్లాడ చిన్న, సన్యాసిరావు, అల్లవరపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదు

- కుటుంబాలను ఎలా పోషించమంటారు..?
- గ్లౌజులు, సబ్బులు, యూనిఫారాలు కార్యాలయంలో మగ్గుతున్నాయి
- ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించకుంటే సమ్మె
- కశింకోట మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు హెచ్చరిక



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట, జూన్ 21 : వేతన బకాయిలు తక్షణమే చెల్లించకుంటే సమ్మె చేస్తామని మేజర్ పంచాయతీ కశింకోటలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామాజీ, జి.వెంకటరమణ మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని వాపోయారు. ఇలా అయితే కుటుంబాలు పోషించేది ఎలా అని ప్రశ్నించారు. గ్లౌజులు, నూనె, సబ్బులు, యూనిఫారాలు, పనిముట్లు, పంచాయతీ కార్యాలయంలో మగ్గుతున్నా ఇన్నాళ్లూ అధికారులు తమకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఒ.అప్పారావు, డి.సూర్య అప్పారావు, అర్జునమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో అరకు, పాడేరు తప్ప మిగిలిన చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు ఓటమి చెందారు. విశాఖ, అనకాపల్లి లోక్‌స్థానాలు కోల్పోయారు. దీంతో స్టాండింగ్ కమిటీల్లో కొత్తగా ఎన్నికైన వారికి స్థానం కల్పించాలి. ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభలలో ప్రమాణంచేసినప్పటి నుంచి రెండు నెలల్లో ఈ ప్రక్రియ ముగించాల్సి ఉంది. అయితే ఈనెల 29వ తేదీన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాల సమయంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు స్థానం ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. దీంతో జడ్పీటీసీ సభ్యులతోనే సమావేశాలు నిర్వహించనున్నారు. వచ్చేనెలలో జరిగే సర్వసభ్య సమావేశంలో స్టాండింగ్ కమిటీలలో ఎంపీ/ ఎమ్మెల్యేలకు చోటు కల్పిస్తారని అధికారులు చెబుతున్నారు.

యువకుడి మృతి

... 3వ పేజీ తరువాయి

ధ్రువీకరించారు. దీంతో మారుతి మృతదేహాన్ని తిరిగి ఎన్‌ఏడీకి బంధువులు, స్నేహితులు తీసుకువెళుతుండగా మండలంలోని హరిపాలెం వద్ద మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పోలీసులు అడ్డుకున్నారు. మృతదేహాన్ని ఎన్‌ఏడీకి తీసుకు వెళ్లకూడదని పోలీసులు.. తాము తీసుకువెళ్లి ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో హరిపాలెం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమస్య పరిష్కారమయ్యే వరకు తాము తగ్గేది లేదని మృతుని బంధువులు, స్నేహితులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 11 గంటల వరకు ఆందోళన కొనసాగుతున్నది.

వైసీపీ దందా

... 3వ పేజీ తరువాయి

ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, అయితే ఇంకా అప్రూవ్ కాలేదని తెలిపారు.

స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా...

ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తూరు, నర్సింగరావుపేట, పోర్టు కాలనీ, సిరసపల్లి, సుబ్రహ్మణ్య కాలనీ వాసులు అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఈ స్థలంలో కొంతభాగం సామాజిక అవసరాలకు కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకుంటామని వారు కోరుతున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలే తప్ప పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయిస్తారంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కనీసం పట్టించు కోలేదు. జీవో 340 ప్రకారం స్థలాన్ని కేటాయించామని అప్పట్లో రెవెన్యూ అధికారులు చెప్పుకొచ్చారు. దీనిపై సంతృప్తి చెందని స్థానికులు 2023 జూన్ నెలలో హైకోర్టులో కేసు కూడా వేశారు.

కుంగిన రామచంద్రపురం వంతెన

... 3వ పేజీ తరువాయి

వంగిపోయాయి. వాహనాల రక్షణ కోసం వేసిన ఇనుప కమ్మీలు సైతం తప్పు పట్టి వేలాడుతున్నాయి.సమాచారం తెలుసుకున్న ఆర్అండ్‌బీ అధికారులు వంతెన పరిస్థితులు గుర్తించి, ఆటోలు, ద్విచక్రవాహనాలు మినహా ఇతర భారీ వాహనాలు రాకపోకలను నిలుపుదల చేశారు. వంతెనకు ఇరువైపులా సగం వరకు రోడ్డుకు అడ్డంగా సిమెంట్‌తో గోడ కట్టారు. నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా రేవుపోలవరానికి రాకపోకలు సాగించే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం, కోటవురట్ల వచ్చే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటవురట్ల నుంచి రామచంద్రపురం వరకు వెళ్లి అక్కడ నుంచి వంతెన దాటి వేరొక వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డు వేయకుంటే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ విషయమై నర్సీపట్నం ఆర్అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డివద్ద ప్రస్తావించగా.. రామచంద్రపురం వంతెన కుంగిపోవడం జరిగిందన్నారు. ఈ వంతెన స్థానంలో కొత్తది నిర్మించేందుకు రూ.కోటిన్నరతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామన్నారు. లారీలు, బస్సుల రాకపోకల కోసం త్వరలోనే డైవర్షన్ రోడ్డు నిర్మిస్తామన్నారు.

కేజీహెచ్‌లో గుక్కెడు నీరూ కరువే!

... 3వ పేజీ తరువాయి

పిలిస్తే ఒకరు జీఎస్‌టీ లేనివారు, ఇంకొకరు వారెంటీ ఇవ్వలేమంటూ కొటేషన్లు వేశారు. దాంతో కొనుగోలు చేయలేదు. అప్పటి నుంచి ఇడ్లీ సరఫరా ఆగిపోయింది. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు ఆగమేఘాలపై ఇడ్లీ మెషీన్ కొనుగోలు కోసం చర్యలు చేపట్టారు. జూలై నుంచి వారానికి మూడు రోజులు ఇడ్లీ పెడతామని తెలిపారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

'కేజీహెచ్‌లో ఇష్టారాజ్యం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నామని చెప్పారు. ఆర్చీల నిర్మాణానికి రూ.32 లక్షలు మాత్రమే ఖర్చు చేశామని, ఆ పనులన్నీ వీఎంఆర్‌డీఏ చేస్తున్నదని, ఏపీఎంఎస్ఐడీసీకి సంబంధం లేదన్నారు. ఏసీలు కూడా 12 మాత్రమే కొనుగోలు చేశామని, వాటిని నిబంధనల ప్రకారమే తీసుకున్నామన్నారు. బ్యాటరీ కార్ల కొనుగోలు సరఫరా చేసిన సంస్థకు తయారీ సంస్థతో అనుబంధం ఉందని, ఏదైనా పాడైతే వారే బాగు చేస్తారన్నారు. అలాగే వివిధ విభాగాలకు అవసరమైన పరికరాలు దశల వారీగా అందుతున్నాయని, అందులో ఏమీ గోల్‌మాల్ జరగలేదన్నారు.

\- డాక్టర్ శివానంద, సూపరింటెండెంట్


ఎలమంచిలిలో ఆసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు


కశింకోట : ఏవీకేపేటలో యోగా చేస్తున్న ఉపాధి కూలీలు


నక్కపల్లిలోని హాకీ గ్రౌండ్‌లో యోగాలో శిక్షణ పొందుతున్న యువత

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- వాడవాడలా ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆసనాల ఆవశ్యకతను వివరించిన ఉన్నతాధికారులు

అనకాపల్లి టౌన్, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్, స్పోర్ట్స్ కల్చరల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. న్యాయమూర్తి రమేష్ యోగా విశిష్టత వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్ తదితరులు పాల్గొన్నారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.దుర్గా శ్యామ్‌ప్రసాద్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో జార్టిక్లబ్ ఆధ్వర్యంలో స్వాభిమాన ట్రస్ట్ యోగా గురువు బీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జరిపారు. కొలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, టీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీ పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకను జరిపారు.

అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లిలో గల చింతామణి గణపతి దత్త క్షేత్రంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త భాస్కర్ అనంతలక్ష్మి యోగా ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, క్షేత్ర ట్రస్టీ రాజు పాల్గొన్నారు.

తుమ్మపాల : యోగా దినోత్సవాన్ని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయిని లంబా గౌరీ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. తుమ్మపాలలో శ్రీకృష్ణ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగా గురువు బుదిరెడ్డి నరసింగరావు విద్యార్థులకు యోగాసనాల పై సాధన చేయించారు. పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్ సమావేశాలు ఏర్పాటు చేసి యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.

కొత్తూరు/కశింకోట : అనకాపల్లి, కశింకోట మండలాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా మెట్టపాలెంలో ఉపాధి హామీ కూలీలతో ఎంపీడీవో మోహన్‌కుమార్ ఆసనాలు వేయించి, యోగా ఆవశ్యకతను వివరించారు.అలాగే, కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు ఆధ్వర్యంలో యోగా డేను జరిపారు. ఉపాధ్యాయుడు సూర్యారావు విద్యార్థులతో ఆసనాలు వేయించారు. అలాగే కశింకోట బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, హెచ్‌ఎం స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరం పోలీసు స్టేషన్ వద్ద యోగాసనాలు వేస్తున్న పోలీసు సిబ్బంది

పాయకరావుపేట : యోగా దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక కనోసా స్కూల్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ సంతాన, వైస్ ప్రిన్సిపాల్ పిలో తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాలు, పాఠశాలల్లో ప్రపంచ యోగా డేను నిర్వహించారు. చినదొడ్డిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.కవిత, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వెంకట రమణ, పీఈటీ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డేలో నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా శిక్షకులు డి.రాంబాబు, సాయి పిల్లలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. నక్కపల్లిలో టీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హాకీ మైదానంలో హాకీ క్రీడాకారులకు యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. హాకీ క్లబ్ సెక్రటరీ తాతాజీ, టీడీపీ, బీజేపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్ ,కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొరుప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయుష్ విభాగం మండల అధికారిణి డాక్టర్ ఆర్.సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ వైనాయుడు, సర్వసిదికధ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ, డాక్టర్ వాసంతి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

కోటవురట్ల : పాములవాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేవీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కని ఆసనాలు వేశారు.

ఎలమంచిలి : ప్రపంచ యోగా దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఎలమంచిలి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతిభవానీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీరరామచంద్రరావు ఆసనాలు వేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు ధూళి నూకరాజు, బి.హరిశంకరావు, పెరుమాళ్ల వెంకట రమణ, ఏజీపీ డి.వెంకటరావు, ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సీఐ గఫూర్, ఎస్ఐలు పాపినాయుడు, సింహాచలం సిబ్బంది కలిసి యోగాను అభ్యసించారు. డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్, విజయ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ఆసనాలు వేశారు. అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అచ్యుతాపురం : యోగా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా జరుపుకున్నారు. హరిపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చక్కని ఆసనాలు వేసి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం శ్రీపాద రంగ, పీడీ ధర్మిరెడ్డి రాజు పాల్గొన్నారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగ్గన్నపేటలో యోగాసనాలు వేశారు. ఫౌండేషన్ ప్రచారకులు టీవీ రమణ, కొల్లి అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని సింహాద్రి ఎన్టీపీసీ సీపీజీ-3 విభాగం సీజీఎం ఆర్ఆర్ పరిదా అన్నారు. స్థానిక దీపాంజలినగర్‌లో గల సంయుక్త హాల్‌లో శుక్రవారం నిర్వహించిన యోగా దినోత్సవంలో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆసనాలు వేశారు. వివిధ విభాగాల జీఎంలు వీటీ కాంబ్లే, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.


సబ్బవరం : మండలంలోని పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు ప్రదేశాల్లో అధికారులు, విద్యార్థులు ఆసనాలు వేశారు. సీఐ పిన్నింటి రమణ, ఎంపీడీవో మహేశ్, ఉపాధి పథకం ఏపీడీ మణికుమార్, ఏపీవో శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే అనకపల్లి పరిధిలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ సీపీ నందిని ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆసనాలు వేశారు. యోగా ఆవశ్యకతను నందిని వివరించారు.

శారదానగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

కొత్తూరు, జూన్ 21 : తుమ్మపాల రెవెన్యూ శివారు కొత్తూరు పంచాయతీ శారదానగర్ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వార్డు సభ్యులు నీటిపల్లి రాజు, తాడి శ్రీనివాస చక్రవర్తి, శ్రీనివాస్, ఎం.నిరంజన్‌కుమార్, దొడ్డి వెంకటరమణ, గొల్లవిల్లి రాజు, సతీష్‌కుమార్ తదితరులు ఎంపీడీవో మోహన్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంకు నుంచి కొత్తూరు ప్రాంతానికి నీరుసరిగా సరఫరా కావడం లేదన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. కనీసం గంట సమయమైనా కొత్తూరు శారదానగర్‌కు తాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

78 వార్డులో విద్యుత్ సమస్య పరిష్కారానికి వినతి


ఈఈ రామకృష్ణకు వినతిని అందిస్తున్న నాయకులు

కశింకోట, జూన్ 21 : జీవీఎంసీ 78వ వార్డు పరిధిలోని లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, ఆగనంపూడి పరిసర ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని ఈఈ రామకృష్ణకు శుక్రవారం స్థానిక ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో 78వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు. లో వోల్టేజీ కారణంగా గృహోపకరణ వస్తువులు, మోటార్లు తరచూ కాలిపోతున్నాయని వాపోయారు. ఈ సమస్యపై వెంటనే స్పందించాల్సిందిగా కోరారు.

'అన్ని ఆర్‌బీకేల్లో రాయితీపై విత్తనాలు పంపిణీ'


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ ప్రభాకర్ తదితరులు

ఎస్.రాయవరం, జూన్ 21 : మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీ బి.ప్రభాకర్ తెలిపారు. ఇక్కడి వ్యవసాయ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజులతో కలిసి విత్తనాలు అందజేసి మాట్లాడారు. ఖరీఫ్‌కు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాల్సిందిగా సూచించారు. ఏవో సౌజన్య టీడీపీ నాయకులు తుమ్మపాల నాగేశ్వరరావు, అల్లు నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన మహాలక్ష్మి కల్యాణ మహోత్సవాలు


వర మహాలక్ష్మికి మహిళలు పూజలు

పాయకరావుపేట, జూన్ 21 : స్థానిక చిట్టూరి మెట్రోలోని వైకుంఠనారాయణ సమేత వర మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ద్వితీయ వార్షిక కళ్యాణ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పాయకరావుపేట, తుని పట్టణాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


పుస్తకాల పంపిణీలో నగేష్ తదితరులు

పాయకరావుపేట, జూన్ 21 : వీజేఆర్ ఫౌండేషన్ ఆదినేత దివంగత వరుపుల రాజా సతీమణి, ఎమ్మెల్యే సత్యప్రభ శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ ఆధ్వర్యంలో పాయకరావుపేటలోని పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు ఇంజరపు సూరిబాబు, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూండ్రంలో 'బడికి పోదాం'ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, విద్యార్థులు

కొత్తూరు, జూన్ 21 : కూండ్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ హాజరై బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి వేడుకలు


ఆలయం ఆవరణలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 21 : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక రథంపై అధిష్ఠించి నగర సంకీర్తన జరిపారు. ఆలయంలో గోపూజ, బాలా త్రిపురసుందరి దేవి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం

అనకాపల్లి టౌన్, జూన్ 21 : ఉడ్‌పేటలోని కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపకులు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ సంగీత పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా యువత చక్కని పాటలతో అందరినీ అలరించారు. అకాడమీ ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న పవన్ విజయ్

అచ్యుతాపురం రూరల్, జూన్ 21 : ఎలమంచిలి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ (దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల)లో జనసేన నాయకులు కొక్కిరగెడ్డ పవన్ విజయ్ మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం పదివేల రూపాయలను సహాయంగా అందజేశారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి

అచ్యుతాపురం, జూన్ 21 : విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని సెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.ఉమామహేశ్వరరావు సూచించారు.శుక్రవారం ఇక్కడి క్రైస్ట్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, అడిగర్ల శంకరరావు, విల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్‌కు పవన్ అభినందన



అచ్యుతాపురం, జూన్ 21 : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం విజయవాడ కనకదుర్గను దర్శించుకున్నారు. తొలుత ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం అమరావతి వెళ్లి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆతనిని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలింగనం చేసుకుని అభినందించారు.

కూటమి శ్రేణులు సంబరాలు


పాయకరావుపేటలో స్వీట్లు తినిపించుకుంటున్న శ్రేణులు

పాయకరావుపేట, జూన్ 21 : ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు శుక్రవారం అసెంబ్లీలోకి అడుగుపెట్టి ప్రమాణస్వీకారం చేయడంతో పాయకరావుపేటలో కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతో పాటు నాయకులు యాళ్ళ వరహాలబాబు, చింతకాయల రాంబాబు, గూటూరు శ్రీనివాసరావు, పల్లా విలియంకేరి, యాళ్ళ సన్నబాబు, చిన్ని, కురందాసు శివ గొర్ల లక్ష్మీనారాయణ, జూరెడ్డి ప్రసాద్, భాస్కర చౌదరి, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : సీఎంగా చంద్రబాబు శాసనసభలో అడుగుపెట్టడం పట్ల నక్కపల్లిలో కూటమి నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన ,బీజేపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, కుంచె మధు, కక్కిరాల సురేశ్, మీగడ సత్తిబాబు, గంటా నర్సింగరావు, గొనగాల రామకృష్ణ, వీరబాబు, మీసాల బాబులు, పల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లిలో...

ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలి

» ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్



సమావేశానికి హాజరైన కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు

చోడవరం, జూన్ 21 : విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారడానికి కారణమైన పాఠశాలల విలీనం చేసే జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవోనెంబర్ 117 వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నదన్నారు. యథావిధిగా ప్రాథమిక పాఠశాలల్లోనే 3, 4, 5 తరగతులు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఐ ఆర్ ప్రకటించడంతో పాటు, పదోన్నతులు కూడా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మహలక్ష్మినాయుడు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ఆర్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో అరకు, పాడేరు తప్ప మిగిలిన చోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు ఓటమి చెందారు. విశాఖ, అనకాపల్లి లోక్‌స్థానాలు కోల్పోయారు. దీంతో స్టాండింగ్ కమిటీల్లో కొత్తగా ఎన్నికైన వారికి స్థానం కల్పించాలి. ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభలలో ప్రమాణంచేసినప్పటి నుంచి రెండు నెలల్లో ఈ ప్రక్రియ ముగించాల్సి ఉంది. అయితే ఈనెల 29వ తేదీన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాల సమయంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు స్థానం ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. దీంతో జడ్పీటీసీ సభ్యులతోనే సమావేశాలు నిర్వహించనున్నారు. వచ్చేనెలలో జరిగే సర్వసభ్య సమావేశంలో స్టాండింగ్ కమిటీలలో ఎంపీ/ ఎమ్మెల్యేలకు చోటు కల్పిస్తారని అధికారులు చెబుతున్నారు.

ఎస్ఐ, సర్పంచ్ చొరవతో రోడ్డుపై గుంతలు పూడ్చివేత



దగ్గర ఉండి రోడ్డుపై గుంతలు పూడ్చివేయిస్తున్న ఎస్ఐ ధనుంజయనాయుడు

రావికమతం, జూన్ 21 : మండలంలో గర్నికం గ్రామం వద్ద బీఎన్ రోడ్డులో ఏర్పడిన గోతులను రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు, గర్నికం సర్పంచ్ కె.రాము సహకారంతో గ్రావెల్‌తో పూడ్చి వేయించారు. ఎప్పటి నుంచో ఈ రోడ్డు గోతులతో నిండిపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతుండడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్ఐ, సర్పంచ్‌లు చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేశారు. వీరిద్దరికీ స్థానికులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, జూన్ 21 : పట్టణ పరిధిలోని అన్నవరం ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈనెల 22 శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రూరల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఈపీడీసీఎల్ ఏఈఈ శ్రీనివాసరాజు తెలిపారు. శనివారం ఉదయం8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అన్నవరం, గాంధీగ్రామం, వెంకయ్యగారిపేట, ఎడ్లవీధి, నరసయ్యపేట, గోవిందమ్మకాలనీ, సిటిజన్ కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈఈ కోరారు.

నిరుపేద ఆదివాసీ బాలికలకు

కేజీబీవీలో అవకాశం కల్పించాలి

» ఐదో షెడ్యూల్ సాధన కమిటీ డిమాండ్



ధర్నా చేపట్టిన కమిటీ ప్రతినిధులు, బాలికలు

రావికమతం, జూన్ 21 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిరుపేద ఆదివాసీ బాలికలకు చదువుకునేందుకు అవకాశం కల్పించాలని డోలవానిపాలెం గిరిజనులు శుక్రవారం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ గిరిజనేతర ప్రాంతంలో కొండలను అనుకొని డోలవానిపాలెం, కొట్నాబిల్లి ఆదివాసీలు జీవిస్తున్నారన్నారు. అయితే ఈ గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు గర్నికం, రోలుగుంట, వడ్డాది, నర్సీపట్నం కేజీబీవీలలో చదువుకునేందుకు గత మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నా సీట్లు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కేజీబీవీల్లో సీట్లు భర్తీ చేయడం తగదన్నారు. నిరుపేద గిరిజన బాలికలకు కేజీబీవీల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ మండల కార్యదర్శి సింగారపు వలయ్య, ఆదివాసీలు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మాదక ద్రవ్యాల నియంత్రణ సాధ్యం

మాడుగుల, జూన్ 21 : మాదక ద్రవ్యాలు నియంత్రణకు ప్రతీ ఒక్కరి కృషి అవసరమని ఎస్ఈబీ ఎస్ఐ కె.హనుమంతు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించి పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం : నవ నిర్మాణ సమితిలో యోగాసనాలు



గొలుగొండ : పోలీస్ స్టేషన్‌లో వద్ద..



బుచ్చెయ్యపేట : వద్దాదిలో కేజీబీవీ విద్యార్థులు..



చోడవరం : గాంధీ విగ్రహం వద్ద వాకర్స్‌క్లబ్ అవగాహన ర్యాలీ

ఉత్సాహంగా యోగా దినోత్సవం

» పాఠశాలలు, కార్యాలయాలు, సంస్థల ఆధ్వర్యంలో యోగాసనాలు » పలు చోట్ల అవగాహన ర్యాలీలు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం పలు చోట్ల అన్ని వర్గాల వారు ఉత్సాహంగా జరుపుకున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని యోగా నిపుణులు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, వివిధ కార్యాలయాల్లో యోగాసనాలు వేశారు.

నర్సీపట్నం, జూన్ 21 : యోగాసనాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని యోగా గురువు రాయపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం శారదానగర్‌లోని నవనిర్మాణ సమితిలో రుషి యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వాకర్స్ క్లబ్, హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొని యోగాసనాలు వేశారు. పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో తలుపు మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగాసనాలు ఆచరించిన వారికి థైరాయిడ్, షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రావన్నారు. కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయమూర్తులు యోగా డేలో పాల్గొని సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పటాన్ షియాజ్‌ఖాన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. యోగాతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు, వివిధ కార్యాలయాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం, చోద్యం హైస్కూల్‌ల్లో విద్యార్థులు యోగాసనం ఆకారంలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.రత్నాజీ, పీఈటీ నూకరాజు, రమణ, ప్రసాద్ తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష ఉపాధి పనులు చేసే కూలీలతో యోగాసనాలు వేయించారు. మాకవరపాలెం ప్రాథమికోన్నత పాఠశాల, తూటిపాల పాఠశాలలో యోగాసనాలు వేయించారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట : వడ్డాది కేజీబీవీ, విజయరామరాజుపేటలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం తదితర ఆసనాలు విద్యార్థినులు, స్థానికులు వేశారు. కేజీబీవీ ఎస్‌వో కోసూరి అన్నపూర్ణ మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

చోడవరంలో..

చోడవరం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఉషోదయ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని లక్ష్మీపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు ఓరుగంటి, జాజుల జగ్గారావు, యోగా గురువు అల్లెపు శ్రీను, రెడ్డిపల్లి అప్పలరాజు, టీవీ రమణ, గనిరెడ్డి, సుధీర్, ప్రాత రాజశేఖర్, గుడివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : యోగాసనాలు వేయడం వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చునని ఎంఈవో కె.సత్యనారాయణ అన్నారు. మండలంలోని దాలివలస ఎంపీయూపీఎస్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట : రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. విద్యార్థులు యోగా ఆకారంలో ఏర్పడి ఆసనాలు చేయడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ యోగా వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం కలుగుతుందన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : యోగా, వ్యాయామం చేయడం వలన మానసిక, శారీరక ఉల్లాసం కలుగు తుందని బేతపూడి కేజీబీవీ ప్రత్యేక అధికారి సీహెచ్ భువన మాధురి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.



మాకవరపాలెం : ఉపాధి హామీ కూలీలతో సర్పంచ్ శిరీష



నాతవరం : ఆసనాలు వేస్తున్న హైస్కూలు విద్యార్థులు

నాతవరంలో..

నాతవరం : మండలంలో వాడవాడలా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నాతవరం హైస్కూలులో విద్యార్థులతో వివిధ రకాల ఆసనాలు వేయించారు. అలాగే మాధవనగరంలో ఉపాధి హామీ కూలీలతో వీఆర్పీ అప్పలనర్స యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.వరహాలబాబు, హెచ్ఎం శాంతకుమారి, టీచర్లు మాష్టారు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ : సంపూర్ణ ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందని ఎంఈవో కె.బొంజుబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగ కార్యక్రమాన్ని విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ప్రతి రోజు ఏదో సమయంలో యోగా చేయాలని సూచించారు.



దేవరాపల్లి : ఆకట్టుకున్న బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో యోగా డే విన్యాసం



కె.కోటపాడులో విద్యార్థుల యోగాసనాలు



రోలుగుంట : యోగా డే నమూనాలో హైస్కూలు విద్యారులు

ఇంటర్ జిల్లా టాపర్ రేవతికి అభినందనలు



రేవతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రోలుగుంట, జూన్ 21 : రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.రేవతి ఇంటర్ (ఎంపీసీ)లో 971/1000 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానం పొందింది. దీనిలో భాగంగానే కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో ఇంజనీరింగ్‌లో ఉచిత సీటును పొందింది. ప్రతిష్ఠాత్మక విట్ అమరావతి యాజమాన్యం ఉచితంగా ఇంజనీరింగ్ సీటు ఇస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ప్రిన్సిపాల్ సహదేవుడు ఆధ్వర్యంలో సిబ్బంది రేవతిని ప్రత్యేకంగా అభినందించారు.

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గొలుగొండ, జూన్ 21 : మండలంలో చీడిగుమ్మల ఆర్బీకేలో శుక్రవారం వరి విత్తనాలను చీడిగుమ్మల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ, నాయకుడు కామిరెడ్డి గోవింద, ఎంపీటీసీ సభ్యుడు లెక్కల అప్పలనాయుడు పంపిణీ చేశారు. మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో గల ఆర్బీకేల్లో రైతులకు అన్ని రకాల వరివిత్తనాలు అందించేందుకు సిద్ధం చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిని సుధావాణి, భీమిరెడ్డి కృష్ణ, స్థానిక సర్పంచ్ చినబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : మండలంలోని లచ్చన్నపాలెంలో శుక్రవారం సచివాలయం వద్ద సర్పంచ్ పోతల రామలక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ ఈ ఏడాది 850 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆర్‌జెఎల్, సాంబమసూరి, సోనామసూరి, 1064, 1061 వరి విత్తనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతల రాంబాబు, మాజీ జడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, బుచ్చిరాం ప్రసాద్, రుత్తల జోగిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న రామలక్ష్మి, రామునాయుడు

కేజీహెచ్‌లో గుక్కెడు నీరూ కరువే!

... 3వ పేజీ తరువాయి

పిలిస్తే ఒకరు జీఎస్‌టీ లేనివారు, ఇంకొకరు వారెంటీ ఇవ్వలేమంటూ కొటేషన్లు వేశారు. దాంతో కొనుగోలు చేయలేదు. అప్పటి నుంచి ఇడ్లీ సరఫరా ఆగిపోయింది. 'ఆంధ్రజ్యోతి'ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు ఆగమేఘాలపై ఇడ్లీ మెషీన్ కొనుగోలు కోసం చర్యలు చేపట్టారు. జూలై నుంచి వారానికి మూడు రోజులు ఇడ్లీ పెడతామన్నారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

- సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

'కేజీహెచ్‌లో ఇష్టారా జ్యం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నామని చెప్పారు. ఆర్వోల నిర్మాణానికి రూ.32 లక్షలు మాత్రమే ఖర్చు చేశామని, ఆ పనులన్నీ ఏపీఎంఆర్‌డీసీ చేస్తున్నదని, ఏపీఎంఎస్ఐడీసీకి సంబంధం లేదన్నారు. ఏసీలు కూడా 12 మాత్రమే కొనుగోలు చేశామని, వాటిని నిబంధనల ప్రకారమే తీసుకున్నామన్నారు. బ్యాటరీ కార్ల కొనుగోలు సరఫరా చేసిన సంస్థకు తయారీ సంస్థతో అనుబంధం ఉందని, ఏదైనా పాడైతే వారే బాగు చేస్తారన్నారు. అలాగే వివిధ విభాగాలకు అవసరమైన పరికరాలు దశల వారీగా అందుతున్నాయని, అందులో ఏమీ గోల్‌మాల్ జరగలేదన్నారు.

గోవాడ షుగర్స్‌ను కాపాడుకుందాం

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూన్ 21 : గోవాడ చెరకు రైతుల్లో షుగర్ ఫ్యాక్టరీపై నమ్మకం పెంచాల్సిన బాధ్యత తనపై ఉందని, గోవాడను గాడిలో పెట్టేందుకు కార్మికులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్మికులను కోరారు. గురువారం సాయంత్రం కార్మిక సంఘం నేత రామునాయుడు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాజు గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. కార్మికులు, ఫ్యాక్టరీ ఎండీ, ఉద్యోగులు ఎమ్మెల్యే రాజుకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు, ఎంపీ సీఎం రమేష్‌లతో చర్చిస్తానన్నారు. ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకుని రావడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ వి.సన్యాసినాయుడు, షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాయి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి రామునాయుడు, ఎస్.ప్రకాశ్, దాడి నాగేశ్వరరావు, వెలుగుల సత్యనారాయణ, సరకాన అప్పలనాయుడు, మడకా మహలక్ష్మినాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కసిశెట్టి మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన రాజు

చోడవరం, జూన్ 21 : ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శుక్రవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ను నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో కూటమి ఎమ్మెల్యేల విజయానికి శ్రమించిన జనసేన నేతలు, జనసైనికులను పవన్‌కల్యాణ్ అభినందించడంతో పాటు, నియోజకవర్గంలో ప్రధానసమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చినట్టు పీవీఎస్ఎన్ రాజు తెలిపారు.



పవన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పీవీఎస్ఎన్ రాజు

ఘనంగా ఏరువాక పౌర్ణమి పూజలు

నర్సీపట్నం అర్బన్, జూన్ 21 : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని దుగ్గాడ పంచాయతీలోని శ్రీరాంపురం గ్రామంలో వెలసినషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బొళెం రాంప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, దుగ్గాడ సర్పంచ్ నిద్ర శ్రీనివాసరావు తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీటీసీ రాంప్రసాద్

యువకుడి మృతి

... 3వ పేజీ తరువాయి

ధ్రువీకరించారు. దీంతో మారుతి మృతదేహాన్ని తిరిగి ఎన్ఏడీకి బంధువులు, స్నేహితులు తీసుకువెళుతుండగా మండలంలోని హరిపాలెం వద్ద మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పోలీసులు అడ్డుకున్నారు. మృతదేహాన్ని ఎన్ఏడీకి కి తీసుకు వెళ్లకూడదని పోలీసులు... తాము తీసుకువెళ్లి ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో హరిపాలెం వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సమస్య పరిష్కారమయ్యే వరకు తాము తగ్గేది లేదని మృతుని బంధువులు, స్నేహితులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 11 గంటల వరకు ఆందోళన కొనసాగుతున్నది.

భారీ వర్షంతో ఉపశమనం

కె.కోటపాడు/ దేవరాపల్లి, జూన్ 21 : కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ తీవ్రంగా ఉండడంతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రానికి భారీ వర్షం కురవడంతో ఊరట చెందారు.

కుంగిన రామచంద్రపురం వంతెన

... 3వ పేజీ తరువాయి

వంగిపోయాయి. వాహనాల రక్షణ కోసం వేసిన ఇనుప కమ్మీలు సైతం తప్పు పట్టి వేలాడుతున్నాయి.సమాచారం తెలుసుకున్న ఆర్అండ్‌బీ అధికారులు వంతెన పరిస్థితులు గుర్తించి, ఆటోలు, ద్విచక్రవాహనాలు మినహా ఇతర భారీ వాహనాలు రాకపోకలను నిలుపుదల చేశారు. వంతెనకు ఇరువైపులా సగం వరకు రోడ్డుకు అడ్డంగా సిమెంట్‌తో గోడ కట్టారు. నర్సీపట్నం నుంచి కోటవురట్ల మీదుగా రేవుపోలవరానికి రాకపోకలు సాగించే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోవ డంతో అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం, కోటవురట్ల వచ్చే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటవురట్ల నుంచి రామచంద్రపురం వరకు వెళ్లి అక్కడ నుంచి వంతెన దాటి వేరొక వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డు వేయకుంటే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ విషయమై నర్సీపట్నం ఆర్అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డివద్ద ప్రస్తావించగా.. రామచంద్రపురం వంతెన కుంగిపోవడం జరిగిందన్నారు. ఈ వంతెన స్థానంలో కొత్తది నిర్మించేందుకు రూ.కోటిన్నరతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామన్నారు. లారీలు, బస్సుల రాకపోకల కోసం త్వరలోనే డైవర్షన్ రోడ్డు నిర్మిస్తామన్నారు.

వైసీపీ దందా

... 3వ పేజీ తరువాయి

ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, అయితే ఇంకా అప్రూవ్ కాలేదని తెలిపారు.

స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినా...

ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తూరు, నర్సింగరావుపేట, పోర్టు కాలనీ, సిరసపల్లి, సుబ్రహ్మణ్య కాలనీ వాసులు అప్పట్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎప్పటి నుంచో ఈ స్థలంలో కొంతభాగం సామాజిక అవసరాలకు కేటాయిస్తే కల్యాణ మండపం నిర్మించుకుంటామని వారు కోరుతున్నారు. రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలే తప్ప పార్టీ కార్యాలయానికి ఏ విధంగా కేటాయిస్తారంటూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు కనీసం పట్టించు కోలేదు. జీవో 340 ప్రకారం స్థలాన్ని కేటాయించామని అప్పట్లో రెవెన్యూ అధికారులు చెప్పుకొచ్చారు. దీనిపై సంతృప్తి చెందని స్థానికులు 2023 జూన్ నెలలో హైకోర్టులో కేసు కూడా వేశారు.